ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
శుక్రవారం 19 జనవరి 2024


జనగామ మండలం పెద్దపహాడ్‌లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య (ఫైల్)

పరిహారంపై పట్టింపేది?

- ఎదురుచూస్తున్న నష్టపోయిన రైతులు
- గత ఏడాది మార్చి, ఏప్రిల్‌లో వడగళ్లతో దెబ్బతిన్న పంటలు
- మొదటి విడత పంపిణీ చేసి చేతులు దులుపుకున్న అప్పటి ప్రభుత్వం
- రెండో విడత సాయం కోసం నిరీక్షణ
- ఖజానాలో నిధులు ఉన్నా అన్నదాతకు మొండిచేయి
- మార్చిలోగా విడుదల చేయకపోతే వెనక్కి?

జనగామ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందాల్సిన పంట నష్ట పరిహారంపై పట్టింపు కరువైంది. ఓవైపు పాత, కొత్త ప్రభుత్వాలు, మరోవైపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా దాదాపు ఏడాది కావస్తున్నా రైతులకు రావాల్సిన పరిహారం డబ్బులు నేటికీ అందడం లేదు. గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జిల్లాలో వడగళ్ల వాన బీభత్సం కారణంగా వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అధికారులు వచ్చి క్షేత్ర స్థాయిలో సర్వే చేసి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో మార్చి, ఏప్రిల్‌లో వడగళ్లు బీభత్సం సృష్టించగా కేవలం మార్చిలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి రూ.4.61 కోట్ల పరిహారం చెల్లించి అధికారులు చేతులు దులుపుకున్నారు. కాగా.. రెండో విడతకు సంబంధించిన రూ.36.69 కోట్లు రైతులకు అందాల్సి ఉంది. నష్ట పరిహారానికి సంబంధించి ఖజానాలో డబ్బులు ఉన్నప్పటికీ విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది.

జిల్లాలో 47,721 ఎకరాల్లో పంట నష్టం

గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జనగామతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడగళ్లు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో వేల ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో అప్పటి సీఎం కేసీఆర్ మహబూబాబాద్ జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.10 వేల సాయం ఇస్తామంటూ అప్పట్లో ప్రకటించారు. కానీ.. ఆ హామీ పూర్తి స్థాయిలో నెరవేరలేదు. జిల్లాలో మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండు విడతలుగా వడగళ్లు బీభత్సం సృష్టించగా మొదటి విడత నష్టానికి సంబధించి పరిహారం రాగా.. రెండో విడత నష్టపరిహారం ఇంకా రావాల్సి ఉంది. మార్చి నెల నష్టాన్ని మొదటి విడతగా, ఏప్రిల్‌లో జరిగిన నష్టాన్ని రెండో విడతగా అధికారులు నిర్ధారించారు. రెండు నెలల్లో కురిసిన వడగళ్ల వర్షాల కారణంగా జిల్లాలో 47,721 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో 44,220 ఎకరాల్లో వరి, 3,173 ఎకరాల్లో మామిడి, 235 ఎకరాల్లో మొక్కజొన్న, 93 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించారు. ఆ తర్వాత పంట నష్టానికి సంబంధించి ఏప్రిల్, మే నెలలో సర్వే చేశారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నష్టం అంచనాను లెక్క తేల్చారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటలో 33 శాతానికి పైగా నష్టం జరిగితే పంట నష్టంగా లెక్కకట్టారు. దీంతో అధికారికంగా 41,309 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా నిర్ధారించారు.

పరిహారం రూ.41.30 కోట్లు

రెండు విడతల్లో పంట నష్టపరిహారం కింద రూ.41.30 కోట్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నిధులను గత ఏడాది జూలై నెలలోనే కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఖాతాలో జమ చేసింది. కానీ, నిధుల విడుదలకు అనుమతి ఇవ్వలేదు. జూలై నెలలో మొదటి విడత కింద 3,698 మంది రైతులకు గాను రూ.4.61 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. కానీ.. రెండో విడత పరిహారాన్ని ఇంత వరకూ జమ చేయడం లేదు. రెండో విడత కింద జిల్లా వ్యాప్తంగా 20,160 మంది రైతులకు సంబంధించి రూ.36.69 కోట్లు రావాల్సి ఉంది. ఈ డబ్బులు ట్రెజరీలో మూలుగుతున్నప్పటికీ రైతులకు పంపిణీ చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోంది.

విడుదల చేయకపోతే నిధులు వెనక్కి?

రెండో విడత పరిహారానికి సంబంధించి రైతులకు రావాల్సిన రూ.36.69 కోట్లు ట్రెజరీలో మూలుగుతున్నాయి. కాగా, ఈ డబ్బులను మార్చి నెలాఖరులోగా రైతుల ఖాతాల్లో జమ చేయకపోతే తిరిగి వెనక్కి వెళ్లే ప్రమాదం ఉంది. మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసి ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఈ క్రమంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన నిధులను వాడుకోకపోతే తిరిగి వెనక్కి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇలా జరిగితే మళ్లీ మొదటి నుంచి ప్రక్రియ ప్రారంభించి ప్రభుత్వానికి లేఖ రాస్తేనే వెనక్కి వెళ్లిన డబ్బులు తిరిగి వస్తాయి. దీంతో మరింత ఆలస్యం అవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన పరిహారం డబ్బులను విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం విడుదల చేయగానే ఖాతాల్లో జమ

- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి



గత ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కురిసిన వడగళ్ల వాన కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి విడత కింద 3,698 మంది రైతులకు రూ.4.61 కోట్లను గత ఏడాది జూలైలో వారి ఖాతాల్లో జమ చేశాం. రెండో విడత నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో పరిహారం ఫైల్‌ను ట్రెజరీకి పంపాం. ఈలోగా ఎన్నికల కోడ్ కూడా అమల్లోకి వచ్చింది. దీంతో కొంత ఆలస్యం అయిందని భావిస్తున్నాం. ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే ట్రెజరీ నుంచి రైతుల ఖాతాల్లో జమ అవుతాయి.

మొదటి, రెండో విడతలో పంట నష్టం జరిగిన రైతులు, పరిహారం వివరాలు

మండలం	మొదటి విడత(మార్చి)		రెండో విడత(ఏప్రిల్)	
	రైతులు	డబ్బులు	రైతులు	డబ్బులు
జనగామ	10	4.34 లక్షలు	4909	9.10 కోట్లు
నర్మెట్ట	134	12.23 లక్షలు	5026	8.56 కోట్లు
తరిగొప్పుల	301	16.84 లక్షలు	726	1.01 కోట్లు
కొడకండ్ల	2389	3.35 కోట్లు	288	29.18 లక్షలు
దేవరుప్పుల	256	21.75 లక్షలు	10	1.20 లక్షలు
పాలకుర్తి	117	10.94 లక్షలు	51	8.88 లక్షలు
స్టేషన్‌ఘన్‌పూర్	76	7.97 లక్షలు	234	23.35 లక్షలు
చిల్పూరు	200	23.42 లక్షలు	441	44.06 లక్షలు
జఫర్‌గఢ్	215	28.61 లక్షలు	01	25 వేలు
బచ్చన్నపేట	0	0	5890	13.88 కోట్లు
లింగాలఘనపురం	0	0	305	43.16 లక్షలు
రఘునాథపల్లి	0	0	2279	2.62 కోట్లు
మొత్తం	3,698	4.61 కోట్లు	20,160	36.69 కోట్లు

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, జనవరి 18: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల కబడ్డీ క్రీడలు గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమానికి డీఈవో కె.రాము అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మమేకమై కబడ్డీ ఆడారు. నిత్యం రాజకీయ కార్యకలాపాలతో బిజీబిజీగా గడిపే ఎమ్మెల్యే పల్లా కబడీ.. కబడ్డీ.. అంటూ కూతబెట్టి ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములతో నిమిత్తం లేకుండా విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. స్థానిక స్టేడియంలో అన్ని వసతుల కల్పనకు, జిల్లాలో అన్ని రకాల క్రీడల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, ఏఎంవో శ్రీనివాస్, ఎంఎస్‌వో వి.రాజేందర్, పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాస్, రాష్ట్ర కబడ్డీ పరిశీలకులు రవికుమార్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పోగుల నరేందర్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ టి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అంతర్ జిల్లాల క్రీడల్లో విజేతలను ప్రకటించారు. బాలుర విభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, నల్లగొండ ద్వితీయ, ఖమ్మం తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో నల్లగొండ ప్రథమ, వరంగల్ ద్వితీయ, ఖమ్మం తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం తెలంగాణ రాష్ట్ర బాలికల, బాలుర జట్లను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో బాలికల జట్టు, జార్ఖండ్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో బాలుర జట్టు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

పాలకుర్తిని మోడల్‌గా అభివృద్ధి చేస్తా..

ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జనవరి 18 : పాలకుర్తిని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి పరుస్తానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండలంలోని గ్రామాల వారీగా అభివృద్ధిపై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని తెలిపారు. పార్టీ నాయకులు గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను గుర్తించి తనకు తెలపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా పని చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో నాయకుల పాత్ర కీలకంగా ఉండాలని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పేదలకు సంక్షేమ పథకాలు అందేలా పనిచేయాలి తప్ప అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, జల్లం కుమారస్వామి, పసులాది యాకస్వామి, అనుమల మల్లారెడ్డి, చిలువేరు కృష్ణమూర్తి, సర్పంచులు నాగభూషణం, పోగు రాజేశ్వరి శ్రీనివాస్, బక్క పుల్లయ్య, మాచెర్ల పుల్లయ్య, ముస్కు నిర్మల చంద్రబాబు, బిర్రు సోమేశ్వర్, కారుపోతు శ్రీనివాస్, గడ్డం యాకసోమయ్య పాల్గొన్నారు.

చలో అయోధ్య!

- అయోధ్య రామ్‌లల్లాకు ప్రత్యేక రైళ్లు
- వరంగల్ నుంచి ప్రతీ సోమవారం 'శ్రద్ధాసేతు'
- కాజీపేట నుంచి ప్రతీ శుక్రవారం యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్
- జనరల్ టికెట్ రూ.400, స్లీపర్ రూ.685
- 30 నుంచి కాజీపేట నుంచి స్పెషల్ ట్రైన్లు

వివరాలు 7లో

బాలవికాస పథకాలు ఆలోచనలు రేకెత్తిస్తాయి

ప్రజల కోసం పనిచేసే సంస్థకు ప్రభుత్వ సహకారం

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కాజీపేట, జనవరి 18: బాలవికాస పథకాలు ప్రభుత్వాలకే ఆలోచనలు రేకెత్తించే విధంగా పూర్తి స్థాయి ప్రజా సేవలో ఉంటాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ప్రజల కోసం పనిచేసే బాలవికాసకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఏ నూతన కార్యక్రమం మొదలు పెట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందని అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ట్రెయినింగ్ సెంటర్‌లో గురువారం తాగునీటి శుద్ధీకరణ పథకం కమిటీల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. కొన్నేళ్లుగా బాలవికాస పలు రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళా పథకాలు, చెరువుల పూడికతీత, అనాథలకు ఆశ్రమం, తాగునీటి శుద్ధీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, వితంతు విముక్తి, మూఢనమ్మకాలను నిర్మూలించడం లాంటి కార్యక్రమాలు రూపొందిస్తూ పలు సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా అభినందనీయులన్నారు. అనంతరం మంత్రి సీతక్కకు బాలవికాస కమిటీ శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అంతకు ముందు బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా మాట్లాడారు. బాలవికాస 47 యేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పలు రాష్ట్రాలో నీటి శుద్ధీకరణ పథకాలతో లక్షల మందికి మంచినీరు అందిస్తున్నామని అన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్‌ల నిర్వహణలో గ్రామపంచాయతీ కమిటీలదే ముఖ్య పాత్ర అన్నారు. ప్లాంట్ల నిర్వహణలో కమిటీలు సేవాభావంతో పనిచేస్తే ఏ సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేడం లింగమూర్తితో పాటు వాటర్ ప్లాంట్ల కమిటీల అధ్యక్షులు, ఆపరేటర్లు, సోపార్ కెనడా ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షుడు నేముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసాని మర్రెడ్డి, సంస్థ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

డీఆర్డీవో మొగులప్ప


రివ్యూలో మాట్లాడుతున్న డీఆర్డీవో మొగులప్ప

నర్మెట, జనవరి 18 : ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించాలని డీఆర్డీవో మొగులప్ప అన్నారు. నర్మెట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్‌తో కలిసి రివ్యూ మీటింగ్ నిర్వహించారు. అంతకుముందు మండలంలోని మల్కపేట, హన్మంతాపూర్, నర్మెట గ్రామాల్లోని నర్సరీలను అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్ పరిశీలించారు. నర్సరీల్లో ఖాళీ బెడ్స్ ఉండకూడదన్నారు. విత్తన నారు మడులను సక్రమంగా పెంచాలని సూచించారు. నర్సరీల్లో సీజర్ అండ్ షవర్ తప్పకుండా ఉండాలన్నారు. ఉపాధి కూలీలు ప్రతి గ్రామంలో 50 మంది కన్నా తక్కువ ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఖాజామొహినొద్దీన్, ఏపీవో రమాదేవి, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఆర్థిక లావాదేవీలు

బచ్చన్నపేట : మహిళా సంఘాలు, సభ్యుల సమగ్ర సమాచారాన్ని గ్రామీణ జీవనోపాదుల మిషన్ ఆధ్వర్యంలో లోకోస్ యాప్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం జరిగిందని డీఆర్డీవో మొగులప్ప తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో జరిగిన వీవోఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘ సభ్యుల ఆర్థిక లావాదేవీలు ప్రతి నెల మొబైల్ ద్వారా యాప్‌లో ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుందన్నారు. దీంతో సంఘం సమగ్ర సమాచారం పారదర్శకంగా ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన శిక్షణను వీవోఏలకు ఇస్తున్నట్లు తెలిపారు. అడిషనల్ డీఆర్డీవో నూరొద్దీన్, డీపీఎం వినత, ఏపీఎం నాగేశ్వర్‌రావు, డీఎంజీ గోవర్ధన్, సీసీలు హాజరయ్యారు.

మహోన్నత వ్యక్తి ఎన్‌టీఆర్

- తెలుగు యువత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి నాగేష్
- జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు


రఘునాథపల్లిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

8లో

ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు

మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత

తరిగొప్పుల, జనవరి 18 : మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ లలిత అన్నారు. తరిగొప్పుల మండల కేంద్రంలోని ఎనిమిదవ వార్డులో తాగునీటి ఇబ్బందులను గురించి తెలుసుకున్న ఆమె సర్పంచ్ దామెర ప్రభుదాస్, అధికారులతో కలిసి గురువారం వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభుదాస్ ఎనిమిదవ వార్డులో ప్రజల అవసరార్థం మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మించాలని కోరగా ఆమె అంచనాలు పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్ఈ లలిత మాట్లాడుతూ మిషన్ భగీరథతో ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈలు శ్రీకాంత్, శ్రీనివాస్, డీఈలు అనిల్, వేణుగోపాల్, ఏఈలు నాగరాజు, దినేష్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిట్‌లో టెక్నోజియాన్

'ఇంజినీయస్' థీమ్ మూడు రోజుల పాటు నిర్వహణ

ప్రారంభ వేడుకకు ప్రముఖ సైంటిస్ట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్ రాక

నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

నిట్‌క్యాంపస్(కాజీపేట), జనవరి 18: వరంగల్ నిట్‌లో యేటా ప్రతిష్మాత్మకంగా నిర్వహించే టెక్నో ఫెస్ట్ టెక్నోజియాన్-2024 జనవరి 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి తెలిపారు. గురువారం నిట్ సెనెట్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి మాట్లాడారు. నిట్ టెక్నోజియాన్ యువతకు, సాంకేతిక అభివృద్ధి అందించడంలో ఎంతగానో తోడ్పడిందన్నారు. ఈ ఫెస్ట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు సేకరించడానికి, వారి సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ టెక్నోజియాన్‌లో అనేక టాప్‌క్లాస్ ఈవెంట్‌లు ఉంటాయన్నారు. ప్రతీ యేటా వివిధ థీమ్‌లతో నిర్వహించే టెక్నోజియాన్‌ను ఈ ఏడాది 'ఇంజీనీయస్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. ఇంజీనీయస్ అంటే ఇన్నోవేషన్‌ను సూచిస్తుందని, ఇది అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన దాని స్ఫూర్తిని కల్పించే భావన అన్నారు. కాగా, నిట్ అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించనున్న టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిట్ చెన్నై త్రిచి డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందరరాజన్ హాజరు కానున్నారని నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి చెప్పారు. ఏరోస్పేస్, మిస్సైల్‌కు సైంటిస్టుగా పనిచేసిన ఆయన.. నిట్ టెక్నోజియాన్‌కు ముఖ్య అతిథిగా రావడం అభినందనీయం అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో సైంటిస్ట్ టీఎస్ సురేశ్‌కుమార్ పాల్గొననున్నారని చెప్పారు. జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, డర్బువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా, మొదలైన స్పాట్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇవే కాకుండా వర్క్‌షాపులు, సాంకేతిక కార్యక్రమాలు, క్విజ్‌తో పాటు సుమారు 40 ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. టెక్నోజియాన్‌లో పాఠశాలల విద్యార్థులు తమ నమూనాలు, ఆలోచనలు కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. సమావేశంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్, టెక్నోజియాన్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ పి.హరిప్రసాద్, ప్రొఫెసర్లు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, టెక్నోజియాన్ కోర్‌టీంసభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలందరికి చేరాలి

మాజీ మంత్రి గుండె విజయరామారావు


వావిలాలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి విజయరామారావు

8లో

నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ● వరంగల్ ప్రాంతంలోని సీసీ రోడ్ల పరిశీలన

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), జనవరి 18: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే పనుల బిల్లుల చెల్లింపులు చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బల్దియా పరిధిలో వరంగల్ ప్రాంతంలోని ఫోర్ట్‌రోడ్‌లోని విద్యానగర్ కాలనీ, బృందావన్ పబ్లిక్ స్కూల్, రంగశాయిపేటలోని శ్రీసాయినగర్, నాగేంద్ర నగర్ ఫేజ్-2 ప్రాంతం, కరీమాబాద్ బండి వారి వీధి, ఉర్సు వాటర్‌ట్యాంక్ ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సీసీ రోడ్లకు చెందిన బిల్లుల చెల్లింపు కోసం కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టెండర్ నిబంధనలకు లోబడి అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాల్లో నిబద్దత లేకుంటే బిల్లుల్లో కోత విధించడం జరుగుతుందన్నారు. రంగశాయిపేట ప్రాంతంలో రోడ్డుపై గృహ నిర్మాణ వ్యర్థాలను ఉంచిన యజమానికి పెనాల్టీ విధించాలన్నారు. అలాగే నాగేంద్ర నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనానికి అనుమతి ఉందో లేదా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, ఏఈలు మోజామిల్, హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

టీయూఎఫ్ఐడీసీ పథకం కింద అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ ముంపు నివారణ చర్యల్లో భాగంగా గతంలో సూచించిన అభివృద్ధి పనులే కాకుండా ఇందులో చేర్చాల్సిన పనులైన ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పైన తగు సూచనలు చేశారు. భద్రకాళి నాలా, బండ్ నుంచి వెళ్లే నాలా, చిన్న వడ్డెపల్లి చెరువు నుంచి, పెద్ద వడ్డెపల్లి నుంచి వెళ్లే నాలాలతోపాటు రిటైనింగ్ వాల్స్, బల్దియా పరిధిలోని 66వ డివిజన్లలో అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు ● బావుపేట వద్ద టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

హసన్‌పర్తి/కరీమాబాద్, జనవరి 18: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా గురువారం రాత్రి టాటా ఏస్ వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో వరంగల్‌లోని ఉర్సు - కరీమాబాద్‌కు చెందిన ఆమంచ శ్యాంసుందర్ (45), ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన డ్రైవర్ రవి (40) ఇద్దరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. హసన్‌పర్తి సబ్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..

ఉర్సు ప్రాంతానికి చెందిన ఉర్సు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు, మునిసిపల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆమంచ శ్యామ్(53).. ఈనెల 16న కుటుంబసభ్యులతో కలిసి శ్రీ రాజ రాజేశ్వరస్వామి దర్శనానికి వేములవాడకు బయలుదేరాడు. శ్యామ్ తల్లి లలిత, భార్య దేవి, కుమారుడు లక్ష్మణ్, సోదరుడు ఆమంచ సంతోష్, అతడి కూతురు అలేఖ్య, కుమారుడు నాగేంద్రతో కలిసి తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన కదరిక రవి(40) టాటా ఏఎస్ వాహనంలో వెళ్లారు. దర్శనం చేసుకుని గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం బావుపేట గ్రామం వద్దకు రాగానే ఆటో ట్రాలీని వెనుకనుంచి వచ్చిన ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమంచ శ్యామ్ అక్కడికక్కడే మృతి చెందగా, కుటుంబ సభ్యులతోపాటు, ఆటో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ రవి (40) మృతి చెందాడు. ఆటో డ్రైవర్ రవికి భార్య శ్రీవిద్య, కుమారులు కిరణ్ తేజ, రవితేజ, కూమార్తె శ్రీ కీర్తన ఉన్నారు. మరో మృతుడు ఆమంచ శ్యామ్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన ఆమంచ శ్యామ్

బస్సు ఎక్కితే ప్రాణాలు దక్కేవి..

ఆమంచ శ్యామ్ వేములవాడ నుంచి కరీంనగర్ చేరుకున్నాక తాను బస్సులో వస్తానని చెప్పి కరీంనగర్ బస్టాండ్‌కు వెళ్లాడు. కానీ, అక్కడ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో తిరిగి ఆటోలోనే ఎక్కాడు. బస్సులో ఎక్కినా బతికేవాడని మృతుడి తల్లి ఆమంచ లలిత, అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, మృతుడు శ్యామ్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని స్థానికులు చెబుతున్నారు.

సంఘటితంతోనే సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టి

ఐనవోలు మార్ట్‌ను సందర్శించిన నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, జనవరి 18: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయని నాబార్డు సీజీఎం సుశీల చింతల తెలిపారు. నందనం ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఐనవోలులో ఏర్పాటు చేసిన సూపర్‌మార్కెట్(మార్ట్) విక్రయకేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మార్ట్‌లో వస్తువుల క్రయ, విక్రయాలు జరుగుతున్న తీరు, వినియోగదారులకు లభించే ధరలను పరిశీలించారు.



ఐనవోలులో మార్ట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల చింతల, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐనవోలులో ఏర్పాటు చేసిన మార్ట్ వినియోగదారులకు ఆకట్టుకునేవిధంగా ఉందన్నారు. పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిల్లో ఏర్పాటు చేసే మార్ట్‌లకు తీసిపోనివిధంగా ఐనవోలు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్యాక్స్ మార్ట్‌లో వస్తువులు, నిత్యావసర సరుకులు మార్కెట్ ధరలకంటే వినియోగదారులకు తక్కువకే విక్రయిస్తూ తాము సైతం ఆర్థికంగా ఎదిగేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేవలం 10 మాసాల కాలంలో రూ.1.89 కోట్ల వ్యాపారం నిర్వహించి రూ.13 లక్షల లాభాలను ఆర్జించినట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాపార కేంద్రంలో కీలక భూమిక పోషిస్తున్న నందనం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సభ్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మొబైల్ విక్రయసేవలతోపాటు మార్ట్‌ల్లో కూరగాయల విక్రయం, విభిన్నరంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మహిళలు, రైతులకు శిక్షణ ఇచ్చి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాబార్డు డీజీఎం శ్రీనివాసులు, డీడీఎం రవి, చంద్రశేఖర్, డీసీసీబీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వజీర్‌సుల్తాన్, ఏజీఎం ఎల్. రాజశేఖర్, డీసీవో నాగేశ్వర్‌రావు, ఇంజనీర్ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్లు చిరంజీవి, శ్రీనివాస్, రాజారపు కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల్లో మార్పులు

వరంగల్, ములుగు జిల్లాలకు రవికుమార్, బలరామ్

హనుమకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ సంస్థాగత మార్పులను చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షులను మార్చింది. పలు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బాగాపని చేసిన జిల్లాల అధ్యక్షులను మాత్రం మార్చలేదు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షులకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫోన్ చేసి సమాచారం అందించారు.

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా రావు పద్మను యథావిధిగా కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పద్మ 20వేలకుపైగా ఓట్లు తెచ్చుకొని మూడోస్థానంలో నిలిచారు. అలాగే జనగామ జిల్లా అధ్యక్షుడిని కూడా మార్చలేదు. ప్రస్తుతం జనగామ జిల్లాకు డాక్టర్ ఎ.దశమంతరెడ్డిని కొనసాగించింది. అయితే మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షుల పేర్లను జాబితాలో పేర్కొనలేదు. పాతవారినే కొనసాగిస్తారా లేక ఈ జిల్లాల అధ్యక్షుల మార్పును పెండింగ్‌లో పెట్టిందా అన్న విషయమై స్పష్టత లేదు. మిగతా జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు.

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్‌ను, ములుగు జిల్లా అధ్యక్షుడిగా బలరామ్‌ను పార్టీ నియమించింది. మొత్తం 12 జిల్లాలకు కొత్త అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆరు మోర్చాలకు కూడా కొత్త అధ్యక్షులను నియమించింది. ఇందులో భాగంగా ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా కొండేటి శ్రీధర్ నియమితులయ్యారు. శ్రీధర్ ఇంతకు ముందు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయింనగర్, జనవరి 18: ఎన్పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2, టీవీ టవర్ కాలనీ, వాటర్ ట్యాంక్, వెంకటేశ్వర్ ఆలయం, నాగరాజు ఆలయం ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గాకాలనీ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, దర్గా, బాలసంతావాడ, హరిజనవాడ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఫాతిమానగర్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, భవానీనగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వడ్డెపల్లి, విజయ్‌పాల్‌కాలనీ, టీచర్స్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గొర్రెకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా కరీమాబాద్ రోడ్, శాంతినగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఫోర్ట్ రోడ్, వాల్‌మార్ట్, అన్నపూర్ణ కాంప్లెక్స్, పద్మశాలి వీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మామునూర్, నక్కలపల్లి, బెస్తం చెరువు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, అరెపల్లి, అయ్యప్ప ఆలయం, అగ్రికల్చర్ కాలేజీ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, పోచమ్మమైదాన్ సర్కిల్, మండిబజార్, బొందలకుంట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 18: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ (సీఇఎల్‌టీ) ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 40 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు సీఇఎల్‌టీ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 22 నుంచి ప్రతీ రోజు సాయంత్రం తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆంగ్లభాష సామర్థ్యాల పెంపు, దినచర్యలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ పాత్ర, ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్, డిబెట్, వివిధ మాధ్యమాలను ఉపయోగించి సమాచార సేకరణ పంపటం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వర్సిటీ విద్యార్థులకు రూ.వెయ్యి, ఇతర విద్యార్థులకు రూ. 1500 చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ ఇంగ్లీష్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.





చలో అయోధ్య!

అయోధ్య రామ్‌లల్లాకు వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి ప్రత్యేక రైళ్లు

గిర్మాజిపేట, జనవరి 18 : అయోధ్యలో రామ మందిర నిర్మాణ పూర్తయిన సందర్భంగా అయోధ్య రామ్‌లల్లా మందిరానికి రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. అయోధ్యకు దేశ నలుమూల నుంచి రైలు సదుపాయం కల్పించాలని రైల్వేశాఖ భావిస్తోంది. ఇప్పటి వరకు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలకు నేరుగా అయోధ్య వెళ్లేందుకు రైలు సదుపాయం లేదు. అయితే రామ మందిరం ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి తెచ్చారు. అలాగే, వంద రోజులపాటు ప్రత్యేక రైళ్లను కాజీపేట నుంచి నడువనున్నాయి. అయోధ్యలో రద్దీ నేపథ్యంలో వీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. వంద రోజుల తర్వాత వీటిని ఇలాగే కొనసాగిస్తారా.. లేక రద్దు చేస్తారా.. అన్నది తెలియాల్సి ఉంది.

వరంగల్ నుంచి శ్రద్ధాసేత్ ఎక్స్‌ప్రెస్

వరంగల్ నుంచి నేరుగా అయోధ్యకు ఇటీవల రామేశ్వరం- అయోధ్య ధామ్ శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెచ్చారు. శ్రద్ధాసేత్ ప్రతీ ఆదివారం రాత్రి 11.50 గంటలకు రామేశ్వరం నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 11.08 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. వరంగల్‌లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి బల్లార్ష, నాగపూర్, ఈటార్సీ, జబల్‌పూర్, సత్నా, ప్రయాగరాజ్ మీదుగా బుధవారం ఉదయం 4.40 గంటలకు అయోధ్య ధామ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. అలాగే, అయోధ్య నుంచి రామేశ్వరం ప్రయాణించే శ్రద్ధాసేత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం రాత్రి 11.10 గంటలకు అయోధ్యలో బయలు దేరి శుక్రవారం తెల్లవారు జామున 2.03 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరిగి 2.05 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి విజయవాడ, గూడూరు మీదుగా రామేశ్వరానికి శనివారం తెల్లవారుజామున 3.10 గంటలకు చేరుకుంటుంది.

కాజీపేట నుంచి యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్..

ప్రతీ శుక్రవారం కాజీపేట నుంచి అయోధ్యకు యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. గురువారం రాత్రి 11.40 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.08గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 2 నిమిషాల అనంతరం కాజీపేట నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 4.24గంటలకు అయోధ్యధామ్ చేరుకుంటుంది.

టికెట్ ధరలు ఇలా..

రామేశ్వరం-అయోధ్య, ధామ్-రామేశ్వరం మధ్య నడిచే శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ని వర్గాల ప్రజలు ప్రయాణించేలా రిజర్వేషన్‌తో పాటుగా జనరల్ బోగీలు ఉన్నాయి. సెకండ్ ఏసీ బోగీలు 2, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ బోగీలు 7, జనరల్ బోగీలు 2 ఉన్నాయి. జనరల్ బోగీలు ముందు ఒకటి. వెనుక ఒకటి ఉన్నాయి. వరంగల్ నుంచి అయోధ్యకు జనరల్ టికెట్ రూ.400, స్లీపర్ రూ.685, సెకండ్ ఏసీ రూ.2,570, థర్డ్ ఏసీ రూ.1,790 ఉంది. అయోధ్య నుంచి వరంగల్‌కు కూడా ఇవే ధరలు ఉన్నాయి. అలాగే కాజీపేట నుంచి అయోధ్యకు, అయోధ్య నుంచి కాజీపేటకు యశ్వంతపూర్- గోరక్‌పూర్-యశ్వంత్‌పూర్ రైల్‌లోనే ఇవే టికెట్ ధరలు ఉన్నాయని తెలిసింది. .

30 నుంచి కాజీపేట నుంచి ప్రత్యేక రైళ్లు

ఈనెల 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన నేపథ్యంలో అయోధ్యలో పెరగనున్న రద్దీ దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సికిందరాబాద్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి అయోధ్య ధామ్ స్టేషన్‌కు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా కాజీపేట- అయోధ్య ప్రత్యేక రైళ్లు కాజీపేట నుంచి ఈనెల 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26,2 8 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు అయోధ్యకు బయలుదేరుతాయి. సికిందరాబాద్ నుంచి అయోధ్య మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు ఈనెల 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో సాయంత్రం 4.45గంటలకు సికిందరాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరుతాయి. ఈ రైళ్లన్నీ కాజీపేట మీదుగానే అయోధ్యకు వెళుతూ కాజీపేటలో ఆగుతాయి. సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్‌ల నుంచి అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైళ్ల టికెట్‌ను కేవలం రైల్వేకి చెందిన ఐఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని రైల్వేశాఖ తెలిపింది. అయితే టికెట్ ధరలను ప్రకటించలేదు.



కరపత్రాలు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు సుధ

గురుకుల ప్రవేశ పరీక్షలపై ప్రచారం

హనుమకొండ రూరల్, జనవరి 18: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 5వ తరగతి ప్రవేశ పరీక్షపై ఓ ఉపాధ్యాయురాలు విస్తృత ప్రచారం చేస్తోంది. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మాడిశెట్టి సుధ గురుకుల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యారాణి ఆదేశాలతో హనుమకొండ పద్మాక్షి కాలనీలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష ఉంటుందని ప్రచారంలో భాగంగా వివరిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో కల్పించే వసతులు, విద్యా ప్రమాణాలు, క్రీడలు తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

కమిషనరేట్‌లో ఇద్దరు ఎస్ఐల బదిలీ

హనుమకొండ క్రైం, జనవరి 18: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే పీఎస్‌లో ఎక్కువ రోజు లు విధులు నిర్వర్తిస్తుండడంతో ఇద్దరికి స్థానచలనం కలిగించారు. హనుమకొండ పీఎస్‌లో పని చేస్తున్న బి.రామారావును చెన్నారావుపేటకు, చెన్నారావుపేటలో పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను హనుమకొండకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు.

రైల్వే క్రికెట్ పోటీల్లో లోకోపైలెట్ టీం విజయం

కాజీపేట, జనవరి 18: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే స్టేడియంలో నిర్వహిస్తున్న రైల్వే క్రికెట్ పోటీలు గురువారం మూడో రోజు కొనసాగాయి. ఈ పోటీలను డీఈఈ అభిషేక్ మిశ్రా, చీఫ్ క్రూకంట్రోలర్ ఎ.సాంబశివుడు హాజరై పోటీలను ప్రారంభించారు. చీఫ్ క్రూ కంట్రోల్ ('సీసీసీ)లోకోపైలెట్ టీం, మహబూబాబాద్ టీంలు మధ్య జరిగిన పోటీల్లో (సీసీసీ) లోకోపైలెట్‌ల టీం విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం, వరంగల్ కింగ్స్ 11 టీం మధ్య జరిగిన పోటీలో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, ట్రెజరర్ జి. రాజేశ్వర్‌రావుతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

వాజేడు, జనవరి 18: లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ములుగు కోర్టు తీర్పు వెలువరించింది. వాజేడు ఎస్సై సి.హెచ్.వెంకటేశ్వరరావు ఈ మేరకు గురువారం వెల్లడించారు. వాజేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో ఓ మహిళపై చెరుకూరుకు చెందిన యాలం భూపతిరావు లైంగికదాడి చేశాడు. బాధితురాలు వాజేడు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ కె.శివప్రసాద్, ఎస్సై కె. తిరుపతిరావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సి.హెచ్.సత్యనారయణ కేసును వాదించారు. వాదోపవాదాల అనంతరం ములుగు జిల్లా జడ్జి లలితశివజ్యోతి ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 18వేల జరిమానా విధించారు.

మిర్చి, పసుపు నాణ్యత ఉండేలా చూడాలి

స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట

వరంగల్‌టౌన్, జనవరి 18: మిర్చి పసుపు పంట సరుకు నాణ్యత ఉండేలా చూసుకోవాలని, అప్పుడే ఎగుమతులకు, గిట్టుబాటు ధర పలికే అవకాశ ఉంటుందని వరంగల్ రీజియన్ స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట అన్నారు. గురువారం నగరంలోని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో రైతులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజిష్ట మాట్లాడుతూ.. సుగంధ ద్రవ్యాలు, పసుపు, మిర్చి నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలోనే మిరప పంట ఉత్పత్తిలో తెలంగాణ లోని ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎక్కువగా సాగు అవుతుందన్నారు. పసుపు సాగుకు కూడా అనువైన భూములు ఇక్కడ ఉన్నాయన్నారు. స్పైసెస్ బోర్డు ల్యాబ్ వరంగల్‌లో లేకపోవడం వల్ల ప్రతీసారి హైదరాబాద్‌కు, లేదా గుంటూరుకు వెళ్లాలంటే రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ స్పైసెస్ ల్యాబ్ ఏర్పాటుకు కావాల్సిన భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా... ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాబార్డు అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, చాంబర్ ప్రతినిధులు మడైరి వేదప్రకాష్, కైలాస హరినాథ్, రాజేశ్వర్‌రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, రాయిశెట్టి సత్యనారాయణ, దేవర రమేష్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజిష్ట

నర్సంపేటలో దొంగల హల్‌చల్

తాళం వేసి ఉన్న రెండిళ్లల్లో చోరీ

నర్సంపేట టౌన్, జనవరి 18: రెండిళ్లలో దొంగలు పడి బుధవారం రాత్రి నగలు, నగదు దోచికెళ్లారు. ఈ ఘటనలో రూ. 7లక్షల నగదు అపహరణకు గురైంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. హనుమకొండ ప్రాంతానికి చెందిన మొలుగూరి నాగేందర్ కుటుంబం ఆరు నెలలుగా నర్సంపేట పట్టణంలోని మహబూబాద్‌లోని ఓంసాయినగర్‌లోని ఓ ప్లాట్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. నాగేందర్ కొద్ది రోజులుగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో జాయింట్ వీల్ (ఎగ్జిబిషన్) వ్యాపారం నిర్వర్తిస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చిపోతున్నాడు. భర్తకు తోడుగా ఉండేందుకు నాగేందర్ భార్య శిరీష, కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 16న ఇంటికి తాళం వేసి జాతరకు వెళ్లింది. కాగా, నాగేందర్, శిరీషలు గురువారం తెల్లవారు జామున 3 గంటలకు ఇంటికి రాగా, ఇంటి మెయిన్ డోర్‌కు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడం, అందులోని రూ.7 లక్షల నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా టౌన్ సీఐ సుంకరి రవీందర్, ఎస్సై శీలం రవి, క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఇదిలావుండగా, నాగేందర్ ఇంటి పక్కన ఉన్న ఇమ్మడి వెంకటేశ్వర్లు, పద్మల కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కొడుకు వద్దకు వెళ్లారు. వీరి ఇంటి తాళాలు సైతం దొంగలు పగులగొట్టి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేశారు. విషయాన్ని పోలీసులు వెంకటేశ్వర్లు కుటుంబానికి సమాచారం అందించినప్పటికీ వారి నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ వివరించారు.



చోరీకి గురైన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

వెల్‌నెస్ సెంటర్‌కు ఏర్పాట్ల పరిశీలన

కాళోజీ జంక్షన్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరుల ఏర్పాటు కోసం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మయ్య గురువారం హనుమకొండకు వచ్చారు. ఈ మేరకు ఆయన వసతి కోసం హనుమకొండ పోస్టాఫీస్ వెనుక గల క్వార్టర్లను, సీఆర్‌పీఎఫ్ క్యాంపులో గల క్వార్టర్లు పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కనీసం 6వేల మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉండాల్సి ఉంటుందని వరంగల్, హనుమకొండ పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వారి సంఖ్య సుమారు 10వేలకు పైగానే ఉన్నట్లు వివరాలను సేకరించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు 25 ప్రాంతాల నుంచి వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌లో మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ పనిచేస్తోంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత గల ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అన్ని విధాలుగా అర్హతలు ఉన్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ అభిప్రాయపడినట్లు తెలిసింది. హనుమకొండలో ఏర్పాటు చేసే ప్రతిపాదనను మరో వారం రోజుల్లో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమక్షంలో ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో హనుమకొండ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది.

గృహహింస కేసులో మూడేళ్ల జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 18 : గృహహింస కేసులో ఒకరికి మూడేళ్ల జైలు శిక్ష పడినట్లు ఎస్సై జి.సతీష్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన కొండ రమేష్‌తో పెద్దనాగారం గ్రామానికి చెందిన తేజస్వినికి 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగ సంతానం రమేష్ వేరొక మహిళను 2013లో వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి తేజస్వినిని తరుచుగా వేధిస్తూ, మానసికంగా హింసిస్తూ, వరకట్నం తేవాలని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తట్టుకోలేక 2014లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తేజస్విని ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టిన తొర్రూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సరిత పోలీసులు ప్రవేశపెట్టిన ఆధారాలు, సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయి రమేష్‌కు మూడేళ్ల కారాగార శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ముందస్తు మొక్కులు

మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 18: వనదేవతలకు భక్తులు గురువారం ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు 50 వేల మంది హాజరయ్యారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా ముందస్తుగా మొ క్కులు చెల్లించుకొనేందుకు వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాల సమర్పించారు. సమ్మక్క. సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారె, కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ప్లాస్టిక్ వినియోగంపై వ్యాపారులకు నోటీసులు

మేడారం, జనవరి 18 : మేడారంలో ప్లాస్టిక్ వినియోగంపై గ్రామ పంచాయతీ అధికారులు కొరడా ఝళిపించారు. పలువురు వ్యాపారులకు గురువారం నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గద్దెల పరిసరాల్లో ఉన్న దుకాణాదారులను వెంటనే తొలగించుకోవాలని ఆదేశించారు.

గ్రామ కార్యదర్శులకు విధుల కేటాయింపు

తాడ్వాయి మండలం మేడారంలో మహా జాతరలో విధులు నిర్వహించేందుకు గ్రామ పంచాయతీల కార్యదర్శులకు విధులు కేటాయించారు. డీపీవో వెంకయ్య ఆదేశాల మేరకు డీఎల్‌పీవో స్వరూప గురువారం ఈ కేటాయింపులు చేశారు. ములుగు జిల్లాలోని 150 మంది కార్యదర్శులకు ఎంపీవోలు శ్రీధర్‌రావు, శ్రీకాంత్‌నాయుడు, కుమార్, హనుమంతరావు, రహీం, శ్రీనివాస్, సాజిదా , మమత విధులు కేటాయించారు. మేడారం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు సూపర్‌వైజర్లను నియమించారు. మహాజాతర ముగిసే వరకు వీరందరూ విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాఫిక్‌జామ్‌కు తావివ్వం

వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ డాక్టర్ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జనవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర నేపథ్యంలో వరంగల్-మేడారం వెళ్లేమార్గంలో ట్రాఫిక్‌జామ్ కాకుండా వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. గురువారం ఆయన పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి ములుగు సమీపంలోని గట్టమ్మతల్లి దేవాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులు ముందుగా గట్టమ్మతల్లిని దర్శించుకుని వెళతారని, ఈక్రమంలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్రమపద్ధతిలో మళ్లించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వాహనాల రద్దీని తగ్గించేందుకు అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని, అనుకోని విధంగా వాహనాలు మరమ్మతులకు గురైతే వాటిని వెనువెంటనే క్రేన్ల ద్వారా క్లియర్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తామని అన్నారు. రాత్రివేళల్లో డైవర్షన్ పాయింట్లలో రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, గట్టమ్మతల్లి దేవాలయం చుట్టుపక్కల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉండే దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, ఎస్సై వెంకటేశ్వర్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



గట్టమ్మతల్లి దేవాలయం ఆవరణలో అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ శబరీశ్

కాళేశ్వరంపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జనవరి 18: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు చేపట్టిన విచారణ రెండోరోజు గురువారంకూడా కొనసాగింది. ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలోని బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. సమారు ఎనిమిది గంటలపాటు ఇరు బ్యారేజీలు, పంప్‌హౌస్‌లో పర్యటించిన అధికారులు జరిగిన నష్టం, దానికి కారణాలపై ఆరా తీశారు. పలు అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- ఎనిమిది గంటలపాటు పరిశీలన

మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు గురువారం ఉదయం 9.30 గంటలకు విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్‌తోపాటు ఎస్పీ బాలకోటి, పది మంది అధికారులు చేరుకున్నారు. సుమారు రెండున్నర గంటలపాటు పంప్‌హౌస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మోటార్లు, వాటికి అనుసంధానంగా కంప్యూటర్లను పరిశీలించారు. వాటితోపాటు దెబ్బతిన్న ప్రాంతంలో జరిగిన నష్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోర్‌బే, అప్రోచ్ కెనాల్, డెలివరీ చానళ్లను పరిశీలించిన అధికారులు వరదలకు ముందు, తర్వాత పంప్‌హౌస్ పరిస్థితిపై ఆరాతీశారు. నష్టం జరగడానికి కారణాలను ఇంజనీర్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రావిటీ కెనాల్ మార్గంలో అన్నారం బ్యారేజీకి చేరుకున్న బృందం సుమారు రెండున్నర గంటలపాటు పరిశీలన చేశారు. బ్యారేజీలో బుంగలుపడి నీటి లీకేజీ కాగా ఆప్రాంతంలో అధికారులు చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. దీంతో పాటు గేట్ల వద్ద నీటి లీకేజీ కావడానికి కారాణాలను అడిగి తెలుసుకున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బ్యారేజీల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి కాళేశ్వరంలోని హరిత హోటల్‌కు చేరుకుని మధ్యాహ్న భోజనం చేశారు.

హరిత హోటల్ నుంచి మేడిగడ్డ బ్యారేజీకి బయల్దేరిన బృందం అక్కడ సుమారు మూడు గంటలపాటు పర్యటించారు. ముందుగా బ్యారేజీ వంతెన పైనుంచి బ్లాక్-7లో కుంగిపోయిన 20వ పిల్లరును పరిశీలించారు. అనంతరం మహారాష్ట్ర వైపు నుంచి నేరుగా వంతెన దిగువకు వెళ్లారు. బ్లాక్-7లో దెబ్బతిన్న 20పిల్లరుతోపాటు దెబ్బతిన్న మిగతాపిల్లర్ల కుంగుబాటుకు గల కారణాలు, జరిగిన నష్టం గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజీ గేట్లను దిగువ నుంచే పరిశీలించిన అధికారులు తిరిగి పైకి చేరుకుని ఆ ప్రాంతాన్ని మళ్లీ పునఃపరిశీలించారు. గేట్ల లిఫ్టింగ్ ప్రక్రియతో పాటు అవి ఎంతమేర ప్రవాహాన్ని తట్టుకోగలవు.. వాటి సామార్థ్యాలు ఏమిటి? అనే విషయాలపై ఆరా తీశారు. బ్యారేజీలో కుంగిపోయిన పిల్లర్లతో పాటు వంతెన దృశ్యాలను విజిలెన్స్ అధికారులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. అక్కడి నుంచి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ కంట్రోల్‌రూం కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. అనంతరం కాళేశ్వరంలోని హరితహోటల్‌కు తిరిగి వెళ్లిపోయారు.

విజిలెన్స్ అధికారుల పర్యటనకు కొన్ని గంటల ముందు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు మేడిగడ్డ బ్యారేజీ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించారు. విజిలెన్స్ అధికారులు ఎక్కడెక్కడ పరిశీలించనున్నారో ఆ ప్రాంతాల్లో ఆయన తిరిగారు. ఆయన వెళ్లిపోయిన వెంటనే విజిలెన్స్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇది యాధృచ్ఛికమా.. ముందుస్తుగా జాగ్రత్త పాటించేందుకే ఈఎన్సీ పర్యటించారా? అనేది చర్చనీయాంశమైంది.



కన్నెపల్లి పంప్‌హౌజ్ ఫోర్‌బే వద్ద విజిలెన్స్ అధికారులు

రేపు మబ్బుగుట్ట జాతర వేలం పాటలు

చిలుపూర్, జనవరి 18 : మండల కేంద్రంలోని మబ్బుగుట్ట సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతరకు సంబంధించి ఈ నెల 20న వేలం పాటలను నిర్వహించనున్నట్లు జాతర కమిటీ చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్, సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు బొమ్మిశెట్టి బాలరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. జాతర ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలం పాటల్లో పాల్గొనే వ్యాపారులు అమ్మవారి పెద్దతీర్థంతో పాటు, కోళ్ల విక్రయం, బంగారం(బెల్లం), కొబ్బరికాయలను విక్రయించేందుకు తగిన దరావత్తును ముందుగా చెల్లించి పాల్గొనాలని సూచించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ కల్చరల్, జనవరి 18: గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ కనగాల శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న వారు 5వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 20 లోగా టీజీ గురుకులం.తెలంగాణ.జిగవ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులకు ఫిబ్రవరి 11న ఉదయం జిల్లాలో ఎంపిక చేయబడిన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 1800 4254 5678 నంబరులో సంప్రదించాలన్నారు.

శాంతియుత వాతావరణం కోసమే కవాతు : ఏసీపీ



బచ్చన్నపేటలో కవాతు చేస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్

బచ్చన్నపేట, జనవరి 18: మండలంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో గురువారం కవాతు నిర్వహించినట్లు ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి బచ్చన్నపేట చౌరస్తా, గోపాల్‌నగర్ చౌరస్తా మీదుగా కవాతు కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అనవసర గొడవల్లో తలదూర్చి కేసుల పాలు కాకూడదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. ప్రజలకు రక్షణ కల్పించేందుకే పోలీసు వ్యవస్థ ఉందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి చెప్పుకోవాలన్నారు. యువత పెడదారి పట్టకుండా తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ టీపీ బాగెల్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్, సీఐ సాయిరమణ, ఎస్‌ఐలు సతీష్, నరేష్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆక్రమణ

- పేదలను ఖాళీ చేయించిన అధికారులు



సిరిసన్నగూడెంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నుంచి ఖాళీ చేయిస్తున్న అధికారులు

పాలకుర్తి, జనవరి 18 : పట్టాలు పంపిణీ చేయకముందే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పేదలు ఆక్రమించడంతో గురువారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ, పోలీసు అధికారులు చేరుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహించి ఖాళీ చేయించిన ఘటన మండలంలోని సిరిసన్నగూడెంలో జరిగింది. సిరిసన్నగూడెం గ్రామంలో అప్పటి ప్రభుత్వం 20 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. గత ఎన్నికల ముందు గ్రామానికి చెందిన మూడు కుటుంబాల పేదలు సామగ్రితో వెళ్లగా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. తమకు ఇళ్లు లేవని ఎన్నో ఏళ్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నామని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మీరు ఖాళీ చేస్తే స్థానిక ఎమ్మెల్యే, జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడి త్వరలోనే గ్రామసభ ఏర్పాటు చేసి లబ్ధిదారుల ఎంపికను చేపడుతామని చెప్పారు. ఇలా ఆక్రమించడం సరైంది కాదన్నారు. మీ అందరికి న్యాయం చేస్తామని నచ్చచెప్పడంతో ఖాళీ చేశారని జిల్లా గృహ నిర్మాణ శాఖ మేనేజర్ దామోదర్‌రావు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకటేశం, రాకేష్ ఉన్నారు.

మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్





ఘన్‌పూర్ పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, పాలకుర్తిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 18: ప్రతీ ఒక్కరికి నందమూరి తారక రామారావు జీవితం అనుసరణీయమని తెలుగు యువత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి శెనబోయిన నాగేష్ అన్నారు. గురువారం మండలంలోని శివునిపల్లి గ్రామంలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో, దేశంలో ఎంతో మంది రాజకీయ నాయకులను, సీఎంలను, పీఎంలను చూసినప్పటికి ఎన్టీఆర్ తరహా నాయకుడు కనిపించడం లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు రాజకీయ అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట రజనీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘన్‌పూర్ పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గట్టు ప్రసాద్ బాబు, మాదిరెడ్డి ధర్మారెడ్డి, మేకల రమేష్, కొట్టె దామోదర్, అరూరి రాజు, రవి, సంపత్, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి నాగేష్

- లింగాలఘణపురం : లింగాలఘణపురం మండల కేంద్రంలో మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు జనగామ వృకోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఆవిష్కరించిన అనంతరం పీహెచ్‌సీలో పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీలం స్వామి, తాటిపాముల శంకరయ్య, కొడితాల శేఖర్‌గుప్త, బర్ల గిరిబాబు, అఫ్జల్‌మియా, యాకుబ్‌పాషా పాల్గొన్నారు.
- రఘునాథపల్లి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయనచిత్రపటానికి టీడీపీనాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురికి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కొంగరి నర్సింగరావు, ఎడ్ల మల్లేశం, అడ్డూరి శ్రీనివాస్, ఉమ్మగోని నర్సయ్య, ఎండి.జహంగీర్, మల్కాపురం చంద్రమౌళి, తూడి యాదగిరి, సుమన్, నకీర్త సత్తయ్య, వెంకటేష్, బీర్రు యాదగిరి, పొన్నాల బక్కయ్య, శ్రీహరి, చాతర్ల రవి, మాల మల్లేశం, దొమ్మాటి వెంకటేష్, పన్నాల వెంకటరమణ, గండికోట యాదగిరి, అఫ్జల్, కాదునూరి మధుసూదన్ పాల్గొన్నారు.
- పాలకుర్తి : ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో పాలకుర్తి, దర్దెపల్లి ప్రధాన రోడ్డులో ఎన్టీ రామారావు విగ్రహం ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల్లి వెంకన్న భూమి పూజ నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఎన్టీరామారావు అటు సినిమా, ఇటు రాజకీయ రంగం రెండింటిలో చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడని అన్నారు. రామారావు 9 నెలల్లో తెలుగుదేశం పార్టీ స్థాపించి అధికారంలోకి వచ్చి చరిత్రలో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, రాంరెడ్డి, బయన్న భిక్షపతి, శ్రీను, యాకన్న, గౌరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై సమావేశం

లింగాలఘణపురం, జనవరి 18: మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిధుల కేటాయింపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సురేందర్‌నాయక్, ఎంఎన్‌వో పడాల విషమూర్తి, ఏపీఎం మేకల శంకరయ్య, వైస్ ఎంపీపీ కిరణ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పోచన్నపేటలో ఉచిత వైద్య శిబిరం

బచ్చన్నపేట, జనవరి 18 : మండలంలోని పోచన్నపేట గ్రామంలో ఆర్వీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్‌ఐ సతీష్ శిబిరాన్ని ప్రారంభించగా, పలు విభాగాలకు చెందిన వైద్యులు 300 మందిని పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఈ నెల 19న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సంయుక్త, మధురిమ, అద్విత, ప్రభాస్, ప్రణీత్, ప్రీతమ్, మేనేజర్ లక్ష్మణ్, గణేశ్‌రెడ్డి, సర్పంచ్ గట్టు మంజుల మల్లేశం, ఎంపీటీసీ మామిడి అరుణ ఐలయ్య, ఉపసర్పంచ్ జూల కిష్టయ్య, సద్ది సోమిరెడ్డి, కంసాని మహేందర్‌రెడ్డి, గూడ సిద్దారెడ్డి, జూకంటి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బయో గుళికలు కొనొద్దు

జనగామ టౌన్, జనవరి 18: జిల్లాలో వరి నాట్లు విస్తారంగా వేస్తున్న క్రమంలో కొందరు మోసగాళ్లు బయో గుళికల పేరుతో గ్రామాల్లో తిరుగుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లో నమ్మొద్దని డీఏవో వినోద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. బయో గుళికలు, బయో ఉత్పత్తులను నేరుగా గ్రామాల్లో అమ్మేందుకు ఎవరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైనా గ్రామాల్లోకి వచ్చి గుళికలు అని చెబితే వెంటనే మండల వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు. కేవలం లైసెన్స్ కలిగిన డీలర్ వద్ద బయో గుళికలు విక్రయిస్తారని వివరించారు. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

అనుమానాస్పదంగా వివాహిత ఆత్మహత్య

- ఉరి వేసుకుందంటున్న కుటుంబ సభ్యులు
- సంఘటన స్థలంలో కనిపించని ఆనవాళ్లు

జనగామ టౌన్, జనవరి 18 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన మంగ నర్సింహులు, మంగమ్మ దంపతుల కుమార్తె అంబిక(32)ను 13ఏళ్ల క్రితం జనగామ పట్టణానికి చెందిన కర్రె మల్లేశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం కలిగారు. మల్లేశ్ డీసీఎం, కారు ట్రావెల్స్ నడుపుతుండగా అంబిక గృహిణిగా ఉంటోంది. గురువారం ఉదయం మల్లేశ్ పనికి పోగా, పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల వరకు పిల్లలకు టిఫిన్ తేకపోవడంతో టీచర్లు అంబికకు ఫోన్ చేశారు. ఎంతకీ స్పందించక పోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వెళ్లి చూడగా అంబిక ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వచ్చేసరికి బంధువులు మృతదేహాన్ని కిందికి దించేసి ఇంటి ముందు పడుకోబెట్టారు. సంఘటన స్థలంలో ఉరి వేసుకున్నట్లు ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో అంబిక మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్సై సృజన్ సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి పంపించారు.

జాతర వేలం పాట ఆదాయం రూ.6.76 లక్షలు



శ్రీపతిపల్లి-కొండాపూర్ సమ్మక్క సారలమ్మ వనదేవతలకు పూజలు చేస్తున్న జాతర కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి

చిలుపూర్, జనవరి 18: మండలంలోని శ్రీపతిపల్లి-కొండాపూర్ సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతర వేలం పాటల ఆదాయం రూ.6.76 లక్షలు సమకూరిందని చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి తెలిపారు. గురువారం జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేలం పాటల కార్యక్రమానికి ఆయా గ్రామాలకు చెందిన పలువురు వ్యాపారులు హాజరయ్యారు. అంతకుముందు కమిటీ సభ్యులతో కలిసి చైర్మన్ మనోజ్‌రెడ్డి వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవారి పెద్దతీర్థం రూ.4.20 లక్షలు, కోళ్ల విక్రయానికి రూ.1.31 లక్షలు, బెల్లం(బంగారం) రూ.81వేలు, కొబ్బరికాయల విక్రయం రూ.44 వేలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ మినీ మేడారంగా విలసిల్లుతున్న వనదేవతల జాతరను రెండు గ్రామాల ప్రజలు, నాయకుల సహకారంతో దిగ్విజయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గొంగిడి కృష్ణమూర్తి, మాలోతు రాజునాయక్, డాక్టర్ గుర్రపు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు పుట్ట రాజు, ప్రధాన కార్యదర్శి రంగు రమేష్, కోశాధికారి కేశిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఉడుత వెంకన్న, కొయ్యడ చంద్రమౌళి, పులి సంపత్, లోడెం రవిందర్, కొడ సంపత్, కొండ తిరుపతి, గాలి ప్రవీణ్, రంగుహరీష్, గడ్డం సిద్దయ్య, గాలి రాజు, మహేశ్, దేవేందర్, పోతరాజు, ఎలిశాల అనిల్, కనకయ్య, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్టిట్యూడ్ టెస్టులో అరబిందో విద్యార్థుల ప్రతిభ



ఎస్.సహస్ర జె.అనీష్ ఎండి.అజ్మల్

జనగామ కల్చరల్, జనవరి 18 : నేషనల్ అనాలిటికల్ ఆప్టిట్యూడ్ టెస్టు(నాట్)లో జనగామ జిల్లా కేంద్రంలోని శ్రీ అరబిందో ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షలో 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొంటారు. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన ఈ టెస్టులో పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ర్యాంకులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఇ.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎస్.సహస్ర(9వ తరగతి) జాతీయ స్థాయిలో 6వ ర్యాంకు, జె.అనీష్(10వ తరగతి) 7వ ర్యాంకు, ఎండి.అజ్మల్(10వ తరగతి) 11వ ర్యాంకు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో ఉపాధ్యాయులు అభినందించారు.

చాకలి ఐలమ్మ నేటి యువతకు స్ఫూర్తిదాయకం



ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 18: సాయుధ పోరాట వీర వనిత చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి తెలిపారు. గురువారం డివిజన్ కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు రజక సంఘం నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి పోరాట యోధులను, వారి చరిత్రను తెలుసుకోవడానికి గాను విగ్రహాలు దోహద పడుతాయన్నారు. చాకలి ఐలమ్మ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయురాలన్నారు. ఐలమ్మ విగ్రహం ఏర్పాటుతో నేటి తరం యువతకు చరిత్ర తెలుస్తుందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీతో యువత దూసుకెళ్లుతున్న తరుణంలో నాటి పోరాటయోధుల చరిత్ర తెలుసుకునే అవకాశం ఉండకుండా పోతుందన్నారు. విగ్రహం ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, పొన్న రవి, ఉపేందర్, భిక్షపతి, రమేష్, రవి, సత్యనారాయణ, రమేష్, రాజశేఖర్, మధు, చింత శ్రీనివాస్, సింగపురం నాగయ్య పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

లింగాలఘణపురం, జనవరి 18 : మండలంలోని కళ్లెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన మబ్బు పరుశరాం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు పాశికంటి యాదగిరి అధ్యక్షత వహించగా పరుశరాం మాట్లాడుతూ తాను చదివిన పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తన బాధ్యతగా గుర్తించి విద్యార్థుల ఉత్తమ ఫలితాలకు తోడ్పాటును అందించానన్నారు. మాజీ సర్పంచ్ మార్పు శ్రీనివాస్‌రెడ్డి, మబ్బు కన్నయ్య, మబ్బు కరుణాకర్, నకీర్త మహేశ్, క్రాంతికుమార్, అశోక్, కరుణాకర్, నాగేశ్, నవీన్ పాల్గొన్నారు.

ప్రజా పాలన ఆవశ్యకతపై పల్లెసుద్దులు

లింగాలఘణపురం, జనవరి 18: తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకంపై కొనసాగుతున్న ప్రజా పాలన కార్యక్రమం ఆవశ్యకతపై జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపల్లిలో ఆటపాట, మాటల రూపంలో పల్లెసుద్దులను నిర్వహించారు. కార్యక్ర మంలో కళాకారులు జనగామ శంకర్, గట్టుగల్ల సంజీవ, బానోత్ గణేశ్, కారుపోతుల సోమన్న, పిన్నింటి రత్నం, కేమడి కనకరాజు, పన్నీరు శ్రీనివాస్, స్వప్న, చంద్రశేఖర్, రంజాన్‌బి, మమత, చామంతి తదిత రులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు స్పోర్ట్స్ మెటీరియల్ వితరణ

జఫర్‌గఢ్, జనవరి 18 : మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి మూలగుండ్ల అజయ్‌రెడ్డి స్పోర్ట్స్ మెటీరియల్‌ను బహూకరించారు. కూనూరు పాఠశాలలో చదువుకున్న ఆయన.. తన భార్య జ్యోతిరెడ్డి జన్మదినం పురస్కరించుకుని రూ.10వేల విలువ గల బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ కిట్లను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పల్లె రాజిరెడ్డి ద్వారా గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో హెచ్‌ఎం పర్వేజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, చంద్రమోహన్, రవి, గిరిజ, ప్రభాకర్, స్వరూపారాణి, రాజేందర్, వేణుగోపాల్, విజయశ్రీ, సిరాజ్, కరుణశ్రీ, శంకర్, ఉమ, యాదగిరి, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవీ కాలం పొడిగించాలని వినతి

పాలకుర్తి, జనవరి 18 : సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎదుట ఎంపీడీవో వనపర్తి అశోక్‌కుమార్‌కు మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సర్పంచులు వీరమనేని యాకాంతరావు, ముస్కునిర్మల చంద్రబాబు, మల్యాల సరిత పర్శరాములు, బుర్క కుమారస్వామి, ఇమ్మడి ప్రకాష్, బొమ్మగాని కొంరయ్య మాట్లాడుతూ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రత్యేకాధికారులుగా సర్పంచులనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లావుడ్యా దేవానాయక్, దారావత్ బాలూనాయక్, రాజేశ్వర్‌రావు, మహేందర్, మంద కొంరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ వీక్షణకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్‌కు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు విజ్ఞప్తి

జనగామ కల్చరల్, జనవరి 18 : అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు జిల్లా కలెక్టర్ సీహెచ్.శివలింగయ్యను కోరింది. ఈ మేరకు గురువారం ట్రస్టు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రజలు చూసే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని దేవాలయాల్లో భక్తులు చూసే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆయా కమిటీలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. హిందూ ధార్మిక సంస్థలు, కుల సంఘాలు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని వారు ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్, నాయకులు మేక బాలసిద్దయ్య, దొంతుల శేఖర్, గుజ్జుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల కింద సిల్ట్ తొలగించాలి

- అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్



జనగామ టౌన్, జనవరి 18 : కల్వర్టుల కింద సిల్ట్‌ను తొలగించాలని అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన జనగామ పట్టణంలోని బస్టాండ్ ఏరియా, హైదరాబాద్, హనుమకొండ రోడ్డు వైపు ప్రధాన మురుగు కాలువలు, స్లాబ్ కల్వర్టులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. చెత్త పేరుకుపోకుండా చూసుకోవాలని సూచించారు. ఆధునాతన పద్ధతులతో కల్వర్టులను శుభ్రం చేసేందుకు పరికరాలను సమీకరించుకోవాలన్నారు. అనంతరం వడ్లకొండ రోడ్డులో గల సఖి కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ఈ నెల 26 కల్లా భవన నిర్మాణ పనులు పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ చంద్రమౌళి, జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హుస్సేన్, సఖి కేంద్రం ఎన్‌జీవో ప్రెసిడెంట్ పరిమళ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పేదలందరికి చేరాలి

- మాజీ మంత్రి గుండె విజయరామారావు

పాలకుర్తి, జనవరి 18: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సామాన్య ప్రజలకు చేరే విధంగా అధికారులు పని చేయాలని వికసిత్ భారత్ సంకల్ప సభ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్, మాజీ మంత్రి గుండె విజయరామారావు అన్నారు. గురువారం మండలంలోని వావిలాల, బమ్మెర, చీమలబాయి తండా, పెద్దతండా (ఎస్‌పీ), గోపాలపురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప సభలను ఆర్‌బీఐ లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ దొంగరి మహేందర్‌తో కలిసి విజయరామారావు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లనే గ్రామాలు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. కేంద్రం విడుదల చేసిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం షోకులు చేసిందని విమర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా సీసీరోడ్లు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, పార్కుల నిర్మాణానికి వినియోగించింది కేంద్ర ప్రభుత్వ నిధులేనని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే నరేంద్రమోదీ మరోసారి కేంద్రంలో అధికారంలోకి రావాలని విజయరామారావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగయ్య, ఏఈవో వెంకటేష్, బీజేపీ నాయకుడు మారం రవి పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

చిలుపూర్, జనవరి 18 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ఆ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ బ్లాక్ ఇన్‌చార్జి నగరబోయిన శ్రీరాములు అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాజీగూడెం, నష్కల్, వంగాలపల్లి తదితర గ్రామాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, ఇన్‌చార్జి తీగల మహేందర్, ఎంపీటీసీలు పాశం శిరీషసురేశ్, ఎన్నకూస కుమార్, భూక్య యాదగిరి నాయక్, నాయకులు మామిడాల యాదవరెడ్డి, తౌటి సునిల్, మర్రి దుర్గాప్రసాద్, మంతెన లవన్, దేవి తిరుపతిరెడ్డి, జీడి కోర్నెల్, మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి, సముద్రాల రజని, కొయ్యడ శోభ, దార మహేందర్, గాలి రాజు యాదవ్, మట్యాడ సునిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : జడ్పీటీసీ



విజేతలకు బహుమతులను అందజేస్తున్న జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం, జనవరి 18 : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందించుకోవచ్చని జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీ విజేతలకు గురువారం లింగాలఘణపురంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి జడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విన్నర్స్‌కు రూ.15వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మల్ల శ్రీశైలం, సర్పంచ్‌లు సాదం విజయ మనోహర్, దూసరి గణపతి, ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, గవ్వల మల్లేశం, ఎడ్ల రాజు, కేమిడి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో దేశం దివాళా

జనగామ టౌన్, జనవరి 18 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధానాలతో దేశం దివాళా తీస్తోందని సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు రాపర్తి రాజు, భూక్యా చందునాయక్, సింగారపు రమేశ్ ఆరోపించారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలోని ప్రజల సంపదను బీజేపీ ప్రభుత్వం అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 16 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో పొత్కనూరి ఉపేందర్, జోగు ప్రకాశ్, రామవత్ మీట్యానాయక్, గంగపురం మహేందర్ పాల్గొన్నారు.

అయోధ్యలో చిందు బృందం ప్రదర్శన



అయోధ్యలో ప్రశంసా పత్రాలను అందుకుంటున్న సమ్మయ్య బృందం

దేవరుప్పుల, జనవరి 18 : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రారంభోత్సవంలో భాగంగా మండలంలోని అప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిందుయక్షగాన బృందం ఐదు రోజులుగా ప్రదర్శనలు ఇచ్చింది. ఈ నెల 14 నుంచి 18 వరకు హంస, కళారత్న అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యతో పాటు బృందం సీత అరణ్యావాసం, లవకుశ, మైరవాణి, సీతారామకల్యాణం, రామాయణంకు సంబంధించి తదితర ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా నార్త్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ ప్రోగ్రాం డైరెక్టర్ అజయ్‌గుప్తా ప్రశంసా పత్రాలను అందజేసి సమ్మయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గడ్డం సాంబయ్య, రఘుపతి, యాకయ్య, శ్రీపతి, రమేష్, ధనుంజయ్య, చిన్న సమ్మయ్య, శంకరయ్య, సోమరాజు, సుదర్శనం, వెంకన్న, హిమగిరి పాల్గొన్నారు.